గుణాత్మక విద్య అందించాలి

ప్రజాశక్తి అనంతగిరి:విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మంచి మెనుతో కూడిన ఆహారం అందించాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం తెలిపారు. మండలంలోని కొత్తూరు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను శుక్రవారం సందర్శించారు. అనంతరం పాఠశాల పరిశుభ్రత, విద్యారుల్థ ఆరోగ్యం, ఉపాధ్యాయ సిబ్బంది పనితీరుపై పాఠశాల ప్రత్యేక అధికారిణి సుశీలను అడిగి తెలుసుకున్నారు. విద్యా బోధనపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థ్ది ఆరోగ్యం పట్ల పాఠశాల సిబ్బందే ఎప్పటికప్పుడు గుర్తించవలసిన బాధ్యత ఉందని తెలిపారు. మెనూ ప్రకారమే విద్యార్థులకు నాణ్యమైన భోజన సదుపాయాలు అందించాలని ఆదేశించారు.

పాఠశాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

మీ కోసం వినతుల పరిష్కారానికి కృషి

- కలెక్టర్ దినేష్ కుమార్ - వెల్లువెత్తిన విజ్ఞప్తులు

ప్రజాశక్తి -పాడేరు:సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థలో శుక్రవారం నిర్వహించిన మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ఎఎస్. దినేష్ కుమార్ వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ భావనా వశిష్ట, ఐటిడిఎ పిఓ వి. అభిషేక్, సబ్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డిఆర్ఓ బి. పద్మావతితో కలిసి 122 వినతులను స్వీకరించారు. ఈ మేరకు హుకుంపేట మండలం బాకూరుకు చెందిన కొర్లాబు వేణు ప్రశాంత్ తనకు ఆంధ్రా యూనివర్సిటీలో సిఎస్ఇ సీటు వచ్చిందన రూ.2 లక్షలు చెల్లించాలని, చదువుకు ఆర్థిక సహాయం అందించాలని వినతిపత్రం సమర్పించారు. పాడేరు మండలం తుంపాడ గ్రామానికి చెందిన కూడ శివ కేశవ, హుకుంపేట మండలం మర్రిపుట్టు గ్రామానికి చెందిన ముంచు రాజబాబు జల్ జీవన్ మిషన్ పనులు పూర్తి తాగునీటి సదుపాయాలు కల్పించాలని దరఖాస్తులను అందజేసారు. పెదబయలు మండలం గిన్నెల కోట ఎంపిటిసి గడుతూరు నిర్మల గిన్నెల కోట పంచాయతీలోని తమలం, కొర్జంగి, కంచురాయి గ్రామాలకు బిటి రోడ్లు నిర్మించాలని కోరారు.పాడేరు మండలం కుజ్జలి గ్రామ సర్పంచ్ కుజ్జలి గ్రామంలో ఎయిడెడ్ పాఠశాల మూత పడిందని, గ్రామంలో ఉన్న విద్యార్థులు రాములుపుట్టు, గెడ్డం పుట్టు గ్రామాలకు వెళ్లి చదువుకుంటున్నారని కుజ్జలి గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేయాలని పలువురు కోరారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మీకోసంలో స్వీకరించిన ఫిర్యాదులను పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపించాలని అధికారులను ఆదేశించారు. మీకోసం పోర్టల్ నిర్వహణపై అధికారులకు శిక్షణ అందిస్తామన్నారు. ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఫిర్యాదుదారులకు కచ్చితమైన ఎండార్సుమెంటు వేయాలని సూచించారు. వరదలకు వంతెనలు, కల్వర్టులు దెబ్బతినకుండా తగిన రక్షణ చర్యలు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. తహశీల్దారులు, ఎంపిడిఓలు, రెవెన్యూ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని స్పష్టం చేసారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా కలెక్టరేటు సమాచారం అందించాలని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ముందుగా ఐటిడిఎ కార్యాలయాన్ని సందర్శించారు. ఐటిడిఎ పిఓ వి. అభిషేక్, సహాయ ప్రాజెక్టు అధికారులు వి.ఎస్. ప్రభాకర్, ఎం.వేంకటేశ్వరరావు కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాలు అందిజేసి స్వాగతం పలికారు. ఐటిడిఏలో సాధారణ పరిపాలనా విభాగం, సహాయ ప్రాజెక్టు అధికారుల చాంబర్లు, ప్రాజెక్టు అధికారి చాంబర్ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఇఇలు డివి ఆర్.ఎం రాజు, కె.వేణుగోపాల్, ఎస్‌డిసి వి.వి ఎస్ శర్మ, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బిఎస్ సంద్, జిల్లా ఉద్యాన వన అధికారి రమేష్ కుమార్‌రావు, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇఇ లీలాకృష్ణ, డి.ఆర్.డి.ఎ పిడి మురళి పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు..



వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే, విశ్వేశ్వరరాజు, అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు

ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల వినతి

పాడేరు:గిరిజన గురుకులల్లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సమస్యలపై శుక్రవారం ఐటిడిఏలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (మీకోసం)లో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్‌కు ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయులతో కలిసి పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఔట్సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని, పెరిగిన పిఆర్సి ప్రకారం వేతనాలు పెంచాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించే డీఎస్సీలో గిరిజన గురుకుల ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజన గురుకులల్లో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు పోరాటం చేస్తానని ఎమ్మెల్యే వెల్లడించారు..

పాడేరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ సిబ్బంది తమకు బకాయి వేతనాలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజుకు వినతి పత్రం అందజేశారు.

తహశీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

ముందస్తు వరద సహాయక చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి-ఎటపాక

వర్షాకాలం గోదావరి వరదల నేపథ్యంలో ముంపునకు గురయ్యే గ్రామాల్లో ముందస్తుగా వరద సహాయక చర్యలు చేపట్టాలని సిపిఎం మండల కార్యదర్శి ఐవి డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఎటపాక తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐవి మాట్లాడుతూ గతంలో వచ్చిన వరదల్లో ఎటపాక మండలంలో అనేక గ్రామాల ముంపు గురయ్యాయని, గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టడంలో, ప్రజలకు నిత్యావసరాలు అందించడంలో గత ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని పేర్కొన్నారు. గత వరదల అనంతరం సిపిఎం ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో నిత్యావసర సరుకులు పంపిణీ చేసి, భోజన సదుపాయం కల్పించి, వైద్య శిబిరాలు ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కొత్త ప్రభుత్వం గత ప్రభుత్వ వైఫల్యాలను దృష్టిలో ఉంచుకొని గతంలో జరిగిన లోపాలు జరగకుండా ముందస్తు సహాయక చర్యలు తీసుకోవాలని, బఫర్ స్టాక్ ఏర్పాటు చేసి ముందు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. తహశీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చిన వారిలో పార్టీ మండల కార్యదర్శివర్గ సభ్యులు డి మాధవరావు, ఆకిసెట్టి రాము, పార్టీ మండల కమిటీ సభ్యులు జి హుస్సేన్, నాయకులు జి సుధాకర్, రాంబాబు తదితరులున్నారు.

బురదబురదగా ఉన్న రహదారిని పరిశీలిస్తున్న ఎంపిపి లక్ష్మి, సిపిఎం నాయకులు

అధ్వాన రహదారిని పరిశీలించిన ఎంపిపి

ప్రజాశక్తి-విఆర్.పురం

విఆర్.పురం బిసి కాలనీ నుండి రేఖపల్లి ఎంపిడిఒ కార్యాలయం వరకు అధ్వానంగా ఉన్న రహదారిని ఎంపిపి కారం లక్ష్మి, సిపిఎం నాయకులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిపి లక్ష్మి మాట్లాడుతూ బిసి కాలనీ నుండి ఎంపిడిఒ కార్యాలయం వరకు సిసి రోడ్డు మంజూరు కాగా, గుత్తేదారు చౌడుమట్టి, నాసిరకం మెటల్ వేసి, రోడ్డు రోలర్‌తో తొక్కించకుండా, రహదారిని పూర్తి చేయకుండా మధ్యలో వదిలేశారని తెలిపారు. దీంతో వర్షాలకు ఈ రోడ్డు మొత్తం అస్తవ్యస్తంగా మారిందని, చిన్న వర్షం కురిసినా రోడ్డంతా బురద బురదగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం నాణ్యత పాటించకపోవడంతో ఈ పరిస్థితి దాపురించిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆ రహదారి ప్రాధాన్యత రీత్యా నాణ్యతా ప్రమాణాలతో సిసి రహదారి నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకపోతే జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనం సత్యనారాయణ, మండల నాయకులు పండా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

దోమతెరలు వినియోగించండి

వైద్యాధికారిణి సౌమ్య

ప్రజాశక్తి- చింతపల్లి :-: దోమ కారక వ్యాధులు దరి చేరకుండా ప్రతి ఒక్కరూ దోమతెరలను వినియోగించాలని ఆర్‌వి నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి కె సౌమ్య తెలిపారు. జులై 1 నుంచి 31 వరకు నిర్వహించ తలపెట్టిన డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు. తీవ్ర జ్వరం, తలనొప్పి, కీళ్లు, కండరాల నొప్పి, వికారం, చర్మంపై దద్దుర్లు, అలసట వంటి లక్షణాలు కలిగి ఉంటే డెంగ్యూ వ్యాధి సోకినట్లేనని గుర్తించాలన్నారు. ఈ విధంగా లక్షణాలు రోగులలో కనిపిస్తే దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. రక్త పరీక్షలలో వ్యాధి నిర్ధారణ అయితే వైద్యాధికారుల సూచనల మేరకు మందులు వాడితే వ్యాధి నయమయ్యే అవకాశం ఉంటుందన్నారు. వైద్యాధికారుల సూచనలను పాటించకపోతే వ్యాధి తీవ్రతరమై ప్రాణ నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత తో పాటు ఇంటి పరిసరాల పరిశుభ్రత, మురుగు కాలువలలో చెత్తాచెదారం లేకుండా చూసుకోవాలన్నారు. వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా మురుగనీరు, చెత్త నిలవ ఉన్నచోట దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. మురుగు నీటి నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఫాగింగ్ నిర్వహించడం జరిగిందని ఆమె తెలిపారు.

పల్లాను కలిసిన దొన్నుదొర

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:టిడిపి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడుగా నియమితులైన గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ను శుక్రవారం ఆ పార్టీ అరకు నియోజకవర్గ ఇంచార్జ్ సివేరి దొన్నుదొర, పెదలబుడు సర్పంచ్ పెట్టేలి దాసుబాబు, మాజీ సర్పంచ్ మహదేవ్, ఉప సర్పంచ్ పాడి చందు నాగరాజు, వెంకటరావు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును సత్కరిస్తున్న దొన్నుదొర, నాయకులు

వైద్యాధికారిపై ఫిర్యాదు

ప్రజాశక్తి -హుకుంపేట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి గాయత్రి విధుల పట్ల నిర్లక్ష్యంగా వహిస్తున్నరని స్పందనలో జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశామని గూడ పంచాయితీ మర్రిపుట్టు గ్రామానికి చెందిన టిడిపి పార్టీ అరకు ఇన్చార్జి చుంచు రాజుబాబు ఒక ప్రకటనలో శుక్రవారం పేర్కొన్నారు. సమయపాలన, అవకతవకలపై పలుమార్లు చెప్పినా పట్టించుకోక పోవడంతో స్పందనలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు.వచ్చిన రోగులు, తోటి సిబ్బందితో తరచుగా గొడవలు పడుతూ ఉంటారని పేర్కొన్నారు. రోగుల పట్ల స్నేహభావం చూపిస్తూ వైద్యం చేయవలసిన ఉన్నా కనీసం రోగులను తాకకుండా దూరంగా ఉండమని చెప్పి వైద్య సేవలు అందిస్తారన్నారు. గిరిజన ప్రాంతంలో అనేకమంది వైద్యులు విధులు నిర్వహించి అనేక సేవలందించి ప్రజల మన్నలు పొందారాని ఆయన గుర్తు చేశారు.

మహిళా రక్షణ కమిటీలు ఏర్పాటు చేయండి

- సబ్ కలెక్టర్ పి ధాత్రిరెడ్డి

ప్రజాశక్తి -పాడేరు: మహిళలు పనిచేసే ప్రదేశాలలో ఎటువంటి లైంగిక వేదింపులకు గురి కాకుండా అరికట్టే దిశగా మహిళల రక్షణ కమిటీలు ఏర్పాటు చేయాలని సబ్ కలెక్టర్ కలెక్టర్ పి. ధాత్రి రెడ్డి అన్నారు. ఐటిడి ఏ సమావేశ మందిరంలో శుక్రవారం అధికారులతో సమావేశ మయ్యారు. పది మంది ఉద్యోగులు ఉన్న ప్రతీ ప్రభుత్వ కార్యాలయాల్లో ముగ్గురు సభ్యులతో కూడిన అంతర్గత కమిటీలు ఏర్పాటు చేసి నివేదికలు సమర్పించాలన్నారు. అన్ని మండల కార్యాలయాలలోను కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. భారత రాజ్యాంగం లోని ఆర్టికల్ 14, 15 హెచ్ ప్రకారం గౌరవంగా జీవించే హక్కు, ఏదైనా వృత్తిని అభ్యసించే హక్కు, లైంగిక వేదింపులకు గురికాకుండా సురక్షితమై వాతావరణం కలిగి ఉండే హక్కులను పొంది ఉన్నారన్నారు. మహిళలు స్వేచ్ఛగా భద్రత కలిగి ఏదైనా వృత్తి, వ్యాపారం నిర్వహించడానికి అవసరమైన వాతావరణ కలిగి ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సంచాలకులు సూర్యలక్ష్మి, వివిద శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

డస్ట్ బిన్‌లను పంపిణీ చేస్తున్న ఎంపిపి, వైస్ ఎంపిపిలు

చెత్త బుట్టల పంపిణీ

ప్రజాశక్తి-హుకుంపేట:మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కూడా రాజుబాబు, వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు, ఎంపీడీఓ రోణాంకి వెంకటరావులు చెత్త బుట్టలను పంపిణీ చేపట్టారు. శుభ్రత అందరి బాధ్యత అని ఎంపీపీ అన్నారు. అనంతరం ఎంపీపీ రాజు బాబు మాట్లాడుతూ మండలంలోని 33 పంచాయితీల కు ప్రతీ ఇంటికి డస్ట్ బిన్ లను అందజేస్తున్నామన్నారు. ప్రతీ ఒక్కరూ బాధ్యత గా తడి, పొడి చెత్త సేకరించి, మెరుగైన పారిశుధ్యం పాటించడంతోనే ఆరోగ్యంగా ఉండవచ్చున్నారు.వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు మాట్లాడుతూ, తడి, పొడి చెత్తతో కంపోస్టు ఎరువు తయారీతో వ్యవసాయం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ, ఎంపీటీసీ సొంబె బాలకృష్ణ, పంచాయితీ సర్పంచ్‌లు రేగం రమేష్, పీ రంజిత్ కుమార్, కొర్ర చిట్టిబాబు, డీడీఓలు జేఈ శెట్టి సంజీవ్ రావు, డిడిఓ అశోక్, పంచాయితీ సెక్రెటరీ లు సాగర్, సత్యనారాయణ, వ్యవసాయసలహా మండలి సభ్యులు విశ్వేస్వరరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శిరీషాదేవి సుడిగాలి పర్యటన

ప్రజాశక్తి- అడ్డతీగల

రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి శుక్రవారం మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. మండల కేంద్రంలోని గురుకులం పాఠశాలలో తాగునీరు లేక విద్యార్థులు ఇక్కట్లు గురవుతున్నారని టిడిపి నాయకులు తెలిపారు. దీంతో ఎమ్మెల్యే శిరీషా దేవి, తెలుగు యువత నియోజకవర్గం అధ్యక్షులు విజయభాస్కర్ టిడిపి నాయకులతో గురుకుల పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా మంచినీరు లేదని ఎమ్మెల్యేకు తెలియజేయడంతో వెంటనే స్పందించిన తెలుగు యువత అధ్యక్షులు విజయభాస్కర్ సుమారు రూ.55 వేలు ఖరీదైన మోటార్లు తెప్పించి స్కూల్‌కు అందజేశారు. వెంటనే బోరుకు బిగించి విద్యార్థులకు తాగునీరు సమస్య రాకుండా చూడాలని ప్రిన్సిపాల్‌ను, ఉపాధ్యాయులను కోరారు. ఇంకా ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని, రెండు నెలల్లో పరిష్కరిస్తామని ఎమ్మెల్యే శిరీషాదేవి తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీ చేయగా ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో రోగులు తీవ్ర ఇక్కట్లు గురవుతున్నారని గమనించారు. ఈ పరిస్థితిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సతీష్‌తో మాట్లాడారు. హాస్పిటల్ మెయింటినెన్స్ డబ్బులు లేవని, ఉన్నవన్నీ ఖర్చు అయిపోయాయని తెలిపారు. దీనిపై రాతపూర్వకంగా ఇస్తే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే చెప్పారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ఎక్కువగా ఉంటాయని, ఏజెన్సీలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, పిహెచ్‌సిలకు అదనంగా నిధులు కోసం కలెక్టర్‌కు విజ్ఞప్తి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎడ్ల శ్రీనివాస్, అక్కపల్లి పండు, ఎం.శ్రీనివాస్, జనసేన నాయకులు జయరాం పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

గిరి రైతులకు అన్ని రకాల విత్తనాలు పంపిణీ చేయాలి

రైతు భరోసా కేంద్రంలో వరి విత్తనాల కోసం గుమిగూడిన గిరి రైతులు

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం దారకొండ రైతు భరోసా కేంద్రంలో వరి విత్తనాలు మాత్రమే అధికారులు పంపిణీ చేస్తున్నారని, అన్ని రకాల విత్తనాలు సరఫరా చేయాలని గుమ్మరేవుల పంచాయతీకి చెందిన గిరిజన రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రాగులు, సామలు, కంది తదితర చిరుధాన్యాలకు సంబంధించిన విత్తనాలు ప్రభుత్వం అందజేయడం లేదని తెలిపారు. వరి విత్తనాలు కూడా అవసరం మేరకు కాకుండా చాలీచాలని పంపిణీ చేస్తున్నారని ఆరోపించారు. తమకు పూర్తిస్థాయిలో విత్తనాలు పంపిణీ చేయాలని అగ్రికల్చర్ అధికారులకు ఫోన్ చేస్తే స్పందించడం లేదని విచారం వ్యక్తం చేశారు. గత ఏడాది పంటలు పండక రైతులు నష్టాన్ని చవిచూశారన్నారు. ఈ ఏడాది రైతులకు పూర్తిస్థాయిలో విత్తనాలు సరఫరా చేయకపోతే పంటలు పండించలేని పరిస్థితి నెలకొంటుందని వాపోయారు. తమ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే స్పందించి గిరి రైతులకు అన్ని రకాల విత్తనాలు సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

సజావుగా పింఛన్ల పంపిణీకి చర్యలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

జులై 1వ తేదీన ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని స్థానిక ఎంపీడీవో లోకుల యాదగిరిశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ కార్యక్రమంపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఎక్కువ మొత్తంలో పెన్షన్ లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సి ఉంటుందని తెలిపారు. రెండు మూడు క్లస్టర్ల ద్వారా మ్యాపింగ్ చేయడం జరుగుతుందని, జులై ఒకటో తేదీ ఉదయం 6 గంటల నుండి సచివాలయ, ప్రభుత్వ ఉద్యోగులతో పెన్షన్ పంపిణీ కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పింఛన్ల పంపిణీ పారదర్శకంగా జరగాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, వెలుగు ఏపిఎం తదితరులు పాల్గొన్నారు.

రేఖా నెం.10/2024/28.06.2024ది

గ్రామ పంచాయతీ కార్యాలయం
సీలేరు

వాయిదా పడిన టెండర్లు మరియు బహిరంగ వేలం పాట నిర్వహణకు
సీలేరు గ్రామపంచాయితీ ప్రకటన

తే12.03.2024దిన ప్రజాశక్తి దిన పత్రికలో సీలేరు గ్రామపంచాయితీ టెండరు మరియు బహిరంగ వేలం ప్రకటన రేఖా నెం.10/2024, తే 11.03.2024ది ప్రాప్తికి తే15.03.2024దిన నిర్వహించుటకు ప్రజాశక్తి దిన పత్రికలో ప్రకటన చేసినప్పటికీ సదరు తేదిన టెండర్లు మరియు బహిరంగ వేలం పాటలలో పాల్గొనుటకు ఏ ఒక్క ఔత్సాహికులు రాని కారణమున సదరు టెండర్లు మరియు బహిరంగ వేలంలను నిర్వధికముగా వాయిదా పడిన గ్రామపంచాయితీ చర్యలుపై లోగడ ప్రజాశక్తి దిన పత్రిక నందు ప్రకటించబడిన షెడ్యూల్ 1 నందు గల టెండర్లను తే 02/07/2024దిన మంగళవారం ఉదయం గం.11.00లు నుండి మద్యాహ్నం గం.01.00లు వరకు స్వీకరించుటకు మరియు షెడ్యూల్ 2 నందలి తెలిపిన భహిరంగ వేలం పాటను అదే రోజు మధ్యాహ్నం గం.03.00లు నుండి సంబందిత అధికారులు సమక్షమున నిర్వహించబడునని ఇందు ద్వారా తెలియజేయడమైనది.

గమనిక : - షెడ్యూలు 1 నందు చూపబడిన క్రమ సంఖ్య 01 నుండి 4వరకు గల టెండర్లుకు సంబంధించింది అనుసంఖ్య 04 నుండి వివరములు గల టెండర్లు మినహా మిగిలిన క్రమ సంఖ్య 01 నుండి 03 వరకు వివరములుగల కాంట్రాక్టు లేబరు సరఫరా నిమిత్తం మాత్రమే టెండర్లు స్వీకరించబడును.

(సం./-) వాసం శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి, గ్రామ పంచాయతీ, సీలేరు.

ప్రజాశక్తి

ఉద్యోగ విరమణ మరియు షష్టిపూర్తి శుభాకాంక్షలు

అతి తక్కువ ధరతో మీ ప్రకటన వేయబడును.

మీ సేవలు మరువలేనివి, మీరెక్కడున్నా మీ శ్రేయస్సును కోరుకుంటాం, అందించండి. ప్రజాశక్తి ద్వారా శుభాకాంక్షలు

మీ సహోద్యోగులు, మీ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులలో ఎవరైనా రిటైర్ అవుతున్నారా? మరియు షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు తెలపాలనుకుంటున్నారా? అయితే అందించండి వారికి అభినందన కుసుమాలు, ఆకాంక్షించండి వారి సుఖమయ జీవితాన్ని ప్రజాశక్తి ద్వారా తెలియజేయండి.

ఉద్యోగ విరమణ
షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు

మరిన్ని వివరాలకు మా స్థానిక ప్రతినిధులను సంప్రదించండి

సిటీ	: 9490099125	పూర్ణమార్కెట్	: 9490099676
మధురవాడ	: 8008596645	జగదాంబ	: 9490099434
గాజువాక	: 9849392359	జివియంసి	: 9490099483
అనకాపల్లి	: 8008736188	ద్వారకానగర్	: 9490099672
చోడవరం	: 9490099141	కంచరపాలెం	: 9490099135
నర్సీపట్నం	: 9440280411	మాదవధార	: 9490099675
పాడేరు	: 9490099142		

రిటైర్డు ఉపాధ్యాయునికి ఘన సత్కారం

వెంకటరమణను సత్కరిస్తున్న జెడ్‌పిటిసి గంగరాజు, ఇతర నేతలు

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని చిలకలగెడ్డ బాలుర ఆశ్రమోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడి వెంకటరమణ పని చేస్తూ ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్రవారం పాఠశాల వద్ద ఘనంగా విడ్కోలు పలికారు. ఎమ్మెల్యే మత లింగం, స్థానిక జడ్పిటిసి దీసరి గంగరాజు, ఎంపీపీ శెట్టి, నీలవేణి, మండల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ వెంకటరమణ గిరిజన ప్రాంతంలో అందించిన సేవలను కొనియాడారు. ఇదే బాటలో పనిచేస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యబోధన అందించాలని మండలంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు కోరారు

సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి- పాడేరు: పాడేరు జిల్లా హాస్పిటల్లో వైద్య విధాన పరిషత్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ వైద్య సిబ్బందికి ఐదు నెలలుగా వేతనాలు అందలేదని పాడేరు శాసనసభ్యులు మత్స్యరాస విశ్వేశ్వరరాజుకు తెలిపారు. గత ఐదు నెలలుగా గౌరవేతనం అందక కుటుంబ పోషణ చాలా ఇబ్బంది పడుతున్నామని కాంట్రాక్ట్, అవుట్సోర్సింగ్ సిబ్బంది తెలిపారు. అధికారులతో మాట్లాడి బకాయిలు చెల్లించాలని సిబ్బంది శాసనసభ్యులకు కోరారు. వేతనాలు చెల్లించేలా అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేలా కృషి చేస్తానని చెప్పారు.

హక్కులు, పథకాలపై శిక్షణ

శిక్షణకు హాజరైన మేట్లు

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని తీగల వలస గ్రామ పంచాయితీ సచివాలయంలో ఉన్న జాతీయ ఉపాధి హామీ పథకం మేట్లను సామాజిక హక్కులు, ప్రభుత్వ పథకాలపై లయ సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. తీగలవలస గ్రామ పంచాయతీలో ఉన్న ఉపాధి పథకం మేట్లకు జాతీయ ఉపాధి హామీ పథకం అమలు విధివిధానాలు పై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో లిప్‌టిక్ సంస్థ ప్రతినిధి కిషోర్ హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

అనధికార నిర్మాణం కూల్చివేత

ప్రజాశక్తి- సీతమ్మధార : జివిఎంసి 24 వ వార్డులో అనధికారికంగా చేపట్టిన అదనపు అంతస్తు భవన నిర్మాణ పనులను శుక్రవారం జివిఎంసి మూడవ జోన్ పట్టణ ప్రణాళిక అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా టిపిఒ ప్రమీల మాట్లాడుతూ జోన్ పరిధిలో అక్రమ నిర్మాణాలు చేపడితే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భవన యజమానులు అనుమతులకు లోబడి నిర్మాణాలను చేపట్టాలన్నారు. ప్లానింగ్ సెక్రటరీ వెంకటలక్ష్మి, ఇతర సిబ్బంది ఉన్నారు.

వరదలపై అప్రమత్తం : కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు : గోదావరి ముంపు గ్రామాల్లో ముందస్తు నివారణ పర్యలు చేపట్టి అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణశాఖ మంత్రి వంగల పూడి అనిత జిల్లా కలెక్టర్లను వరద నివారణ చర్యలపై శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్‌లో సూచించారు. ఈ సందర్భంగా అల్లూరి జిల్లా కలెక్టర్ ఎస్. దినేష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో సాధారణ వర్షపాతం నమోదవుతోందన్నారు. పాడేరు విజన్ పరిధిలోని జి.కె. వీధి మండలంలో ఎక్కువగా వర్షపాతం నమోదయ్యిందన్నారు. వరద ముంపు గ్రామాల్లో రెవెన్యూ అధికారులను, జిల్లా అధికారులను అప్రమత్తం చేసామన్నారు. వాహనాలు రవాణాను నియంత్రిస్తామని విప్పారు. గ్రామ రెవెన్యూ అధికారులను పరిసర ప్రాంతాలలో నియమించడం జరగిందన్నారు. ముంపు గ్రామాల ప్రజలను చైతన్యవంతం చేస్తున్నామని తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ముందస్తు నివారణ చర్యలు చేపడుతున్నామన్నారు. శిథిలావస్థలో ఉన్న పాఠశాలల భవనాలను గుర్తించి ముందుగానే సురక్షితమై ప్రాంతాలకు విద్యార్థులను తరలించాలని సూచించారు. గర్భవతల ప్రసవ సమయాన్ని గుర్తించి ఆసుపత్రులకు తరలించి తగిన వైద్య అందించాలని చెప్పారు. మట్టి ఇళ్లు, తాటాకుల నివాసాలలో జీవిస్తున్న వారిని ఆప్రమత్తం వేయాలన్నారు. వరద తీవ్రతను గుర్తించి సురక్షిత భవనాలకు తరలించి పునరావాస, సహాయ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ భావనా పశిస్ట్, డి.ఆర్.ఓ బి.పద్మావతి, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి. ఎస్.నంద్, జిల్లా ఉద్యాన వన అధికారి రమేష్ కుమార్ రావు, రహదారులు భవనాల శాఖ ఇఇ సుందర బాబు, గిరిజన సంక్షేమ శాఖ ఇఇలు రాజు, కె.వేణుగోపాల్, గిరిజన సంక్షేమ శా ఉపసంచాలకులు ఐ. కొండలరావు, డిఇఓ బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఇతర అధికారులు

1800 మంది గీతం విద్యార్థులకు ఉద్యోగాలు

ఉద్యోగాలకు ఎంపికైన గీతం విద్యార్థులు

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలతో ఇంజనీరింగ్, సైన్స్, మేనేజ్‌మెంట్, ఫార్మశీ, ఆర్కిటెక్చర్, సామాజిక శాస్త్ర కోర్సులను పూర్తి చేసిన 1800 మంది విద్యార్థులకు భారీ వేతనాలతో ప్రముఖ కంపెనీలు ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ప్రముఖ ఐటి కంపెనీలు టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్), క్యాప్ జెమిని, కాగ్నిజెంట్, ఒరాకిల్, బోష్, యాక్సెంచూర్, స్టేట్ స్ట్రీట్, ఐబిఎమ్, టాటా ఎలాక్సి, హుండాయ్ కంపెనీలు ఇంజనీరింగ్ విద్యార్థులకు ప్రాంగణ నియామకాలు నిర్వహించగా, డెలాయిట్, ప్రైస్ వాటర్ కుపార్, ఫెడరల్ బ్యాంక్, గోద్రేజ్, బెర్కాడియా, విప్రో, గ్రాసిమ్ పెయింట్స్, కోల్గేట్ పామోలివ్ తదితర కంపెనీలు మేనేజ్మెంట్ విద్యార్థులను క్యాంపస్ ఇంటర్వ్యూలలో ఎంపిక చేశారు.

సైన్స్, ఫార్మశీ విద్యార్థులను అరిబిందో ఫార్మా, హెటిరో డ్రగ్స్, స్వస్తిక్ ఫార్మా, ఎమ్ఎస్ఎన్ లేబోరేటరీస్, ఓజి హెల్త్కేర్, ఆర్గెన్ లైఫ్ సైన్సెస్, మైక్రాన్ వంటి సంస్థలు ఎంపిక చేసుకున్నాయి. గీతం ఆర్కిటెక్చర్ విద్యార్థులకు సైడ్ డిజైన్స్, సెరైన్స్, క్రీడా ఆర్కిటెక్, ది డిజైన్ గ్రూప్ ప్రాంగణ నియామకాల్లో ఉద్యోగాలిచ్చాయి.

ఎంపికైన గీతం విద్యార్థులకు రూ.4.25లక్షల నుంచి రూ.16.22 లక్షల వరకు వార్షిక వేతనం ఇచ్చేలా ఉద్యోగాలు వచ్చాయి. ప్రముఖ అంతర్జాతీయ సంస్థల్లో ఉద్యోగాలు సాధించడానికి గీతం జిసిజిసి ద్వారా ఇచ్చిన శిక్షణ, వ్యక్తిత్వ వికాస తరగతులు, సాంకేతిక సదస్సులు, నమూనా ఇంటర్వ్యూలు, హ్యాక్ థాన్ పోటీలు ఉపయోగపడ్డాయని, పరిశ్రమల అవసరాలను గుర్తించి విద్యార్థులకు శిక్షణ ఇవ్వటం ద్వారా మెరుగైన ఫలితాలను సాధిస్తున్నామని జిసిజిసి అధికారులు తెలిపారు.

బాల్య వివాహాల అనర్థాలపై నృత్యరూపకం

ప్రజాశక్తి -గాజువాక : :-బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు నిర్వహించిన కళాజాతా నృత్యరూపకం అందరినీ ఆకట్టుకుంది. జివిఎంసి 74వ వార్డు, దయాల్ నగర్-2 అంగన్వాడీ కేంద్రం వద్ద ఐసిడిఎస్ ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల వల్ల తలెత్తే ఇబ్బందులను ఆట, పాటల ద్వారా కిశోరబాలికలు, బాలింతలు, గర్భిణులు, మహిళలకు వివరించారు. బాలల హక్కులు, చట్టాలు, గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్,అంగన్వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారం తదితర అంశాలపై స్థానికులకు అవగాహన కల్గించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త పి బేబీ కళావతి, ఎమ్ఎస్ కె.సత్యవతి, పి సుజాత, పి శివప్రభ, ఎం చిట్టమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలపై ఎండియుల వినతి

మంత్రి సంధ్యారాణితో మాట్లాడుతున్న ఎండియులు

ప్రజాశక్తి- దుంబ్రిగుడ : గిరిజన ప్రాంతంలో ఎండీయులతో రేషన్ పంపిణీకి చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి అల్లూరి జిల్లా ఎండీయూలు శుక్రవారం వినతి పత్రాన్ని అందజేసి విన్నవించారు. స్పందించిన ఆమె ఎండీయూల తొలగింపు పుకార్లేనని, లేనిపోని అపోహలకు పోకుండా ఉండాలని, ప్రభుత్వం ఎండీయూలకు వంద శాతం కొనసాగించేందుకు చర్యలు తీసుకునే యోచనలో ఉందని మంత్రి స్పష్టం చేశారని అల్లూరి జిల్లా అధ్యక్షుడు సునీల్ తెలిపారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో రేషన్ పొందడానికి సుదూర గ్రామాలు ఉన్నాయని, రేషన్ డిపోల చెంతకు వెళ్లి తీసుకోవడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. గిరిజనులు ఇంటింటికి రేషన్ పొందేలా ఎండీయూలను విధుల్లోకి తీసుకోవాలని వినతి పత్రంలో పేర్కొవడం జరిగిందని ఆయన తెలిపారు.

పింఛన్ల పంపిణీకి చర్యలు

మాట్లాడుతున్న ఎంపిడిఒ వీరసాయిబాబు

ప్రజాశక్తి - చింతపల్లి: సామాజిక పెన్షన్ లబ్ధిదారులకు జులై 1 న ఎన్టీఆర్ భరోసా పింఛన్ అందేలా చర్యలు తీసుకుంటున్నామని స్థానిక ఎంపీడీవో వీరసాయిబాబు అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం సచివాలయ సిబ్బంది. కార్యదర్శులతో పింఛన్ పంపిణీ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక పెన్షన్ అందించేందుకు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్, కార్యదర్శులు కలిసి నగదు విత్ డ్రా చేయాలన్నారు. జులై 1న నేరుగా లబ్ధిదారుల ఇంటికే సిబ్బంది పెన్షన్ లు అందించాలని, అదే రోజు 100 శాతం పెన్షన్ లు లబ్ధిదారులకు చేరేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు

ప్రజాశక్తి- పెదబయలు : స్థానిక బాలుర రెసిడెన్సియల్ పాఠశాలలో శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంపీహెచ్ఓ వెంకట రావు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎనిమియా పై 151 మందికి రక్త పరీక్షలు నిర్వహించారు, అనంతరం విద్యార్థులకు ఉచితంగా మందులు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది బాబురావు, రమేష్, వీరన్న పడల్, ప్రిన్సిపాల్ శంకర్‌రావులు పాల్గొన్నారు

పరీక్షలు చేస్తున్న సిబ్బంది

సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ సయ్యద్ మౌలాన్ పాజల్

రెవెన్యూ సిబ్బందితో తహశీల్దారు సమావేశం

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలో రేఖపల్లి తహశీల్దారు కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో శుక్రవారం తహశీల్దారు సయ్యద్ మౌలాన్ పాజల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమోటో క్యాస్ట్ వెరిఫికేషన్, నిత్యావసర సరుకుల పంపిణీ, వరదల సమయంలో పునరావాసం, సహాయక చర్యలు చేపట్టడానికి గ్రామస్థాయి కమిటీల నియామకం తదితర విషయాలపై విఆర్ఒలకు ఆదేశాలు జారీ చేశారు. వరదల విషయంలో అందరూ తమ పరిధిలో ఉన్న గ్రామాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని, ప్రజలకు నిత్యావసర సరుకులు సక్రమంగా అందేలా చూడాలని కోరారు. ఏ సమస్య ఉన్న వెంటనే తనకు తెలియజేయాలన్నారు.

సీతారామచంద్రస్వామి ఆలయంలో విగ్రహాలు అపహరణ

ప్రజాశక్తి- విఆర్.పురం : మండలంలోని శ్రీరామగిరి గ్రామంలో ఉన్న శ్రీసుందర సీతారామ చంద్రస్వామి వారి దేవస్థానంలో దొంగలు పడ్డారు. ఆలయంలోని సుమారు 500 ఏళ్ల చరిత్ర కలిగిన అత్యంత పురాతన ఇత్తటి లోహపు విగ్రహాలను అపహరించుకుపోయారు. శుక్రవారం విగ్రహాలు అపహరణకు గురైనట్లు ఆలయంలో పనిచేసే స్వీపర్ గుర్తించారు. ఈ విషయాన్ని గ్రామస్తులకు తెలియజేయగా, వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో స్థానిక ఎస్సై కె.నాగరాజు సంఘటన స్థలానికి చేరుకొని ఆలయ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఇత్తటి లోహపు విగ్రహాలు అపహరణకు గురైనట్లు నిర్ధారించి కేసు నమోదు చేశారు. దీనిపై విచారణ చేపడుతున్నట్లు ఎస్సై కె.నాగరాజు తెలిపారు.

విశాఖ సిపిగా శంకబ్రతా బాగ్చీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం నగర పోలీసు కమిషనర్‌గా రాష్ట్ర డిజిపి కార్యాలయంలో అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి - లా అండ్ ఆర్డర్)గా పనిచేస్తున్న 1996 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన శంకబ్రతా బాగ్చీని బదిలీ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2023 సెప్టెంబర్ నుంచి విశాఖపట్నం నగర పోలీస్ కమిషనర్‌గా విధులు నిర్వహించిన 1994 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన డాక్టర్ ఎ.రవిశంకర్ అయ్యర్‌ను సిఐడి అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా బదిలీ చేసినట్టు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రవిశంకర్ విశాఖ సిపిగా పనిచేసిన కాలంలో మిలాన్-2024, సార్వత్రిక ఎన్నికలు వంటి ప్రతిష్టాత్మక కార్యక్రమాలను ముందస్తు ప్రణాళికలతో విజయవంతంగా నిర్వహించారు. డయల్ యువర్ సిపి, దిశ, దివ్యాంగ సురక్ష వంటి కార్యక్రమాలను ప్రవేశపెట్టారు.

విజయవాడ థర్మల్ పవర్‌ప్లాంట్ పర్యావరణానికి హానికరం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విజయవాడ థర్మల్ పవర్ ప్లాంట్ పర్యావరణ చట్టం కింద ఇచ్చిన అనుమతులను ఉల్లంఘిస్తూ పరిసర గ్రామాల మీద కాలుష్యం వెదజల్లుతోందని, దీనిపై వెంటనే చర్యలు చేపట్టాలని విశ్రాంత ఐఎఎస్ అధికారు ఇఎస్.శర్మ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు లేఖ ద్వారా తెలిపారు. ఆ వివరాలను ఆయన శుక్రవారం వెల్లడించారు. ఆయా గ్రామాల ప్రజలను కొన్ని నెలల కింద తాను కలిసినప్పుడు వారు ఆ కాలుష్యం వల్ల ఎలా ఇబ్బంది పడుతున్నదీ తెలిసిందన్నారు.

రైల్వే జోన్ ఇంకెంత దూరం..!

జనరల్ మేనేజర్ పోస్టును కేంద్రం కేటాయించేనా ?
కూటమి ప్రభుత్వం ఒత్తిడి తెచ్చేనా ?

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు అంశం మళ్లీ తెరమీదకు వస్తోంది. రాష్ట్రంలో భారీ మెజారిటీతో 'కూటమి' పార్టీలైన తెలుగుదేశం, జనసేన, బిజెపి అధికారం చేపట్టిన విషయం తెలిసిందే. ఉమ్మడి విశాఖ జిల్లాలో కూటమి అభ్యర్థులే విజయఢంకా మోగించారు. వారంతా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రైల్వే జోన్ ఆవశ్యకతను ప్రస్తావించారు. ఇప్పుడు గెలిచారు కాబట్టి.. వారు కథలు చెప్పి తప్పించుకోడానికి అవకాశం లేదని పలువురు భావిస్తున్నారు. వాస్తవానికి విశాఖకు రైల్వే జోన్ అర్హత ఏనాడో ఉంది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన స్టీల్‌ప్లాంట్, పోర్టు, షిప్‌యార్డు సహా పలు కంపెనీలు ఇక్కడే ఉన్నాయి. రైల్వే జోన్ పనులు ప్రారంభిస్తున్నామన్న కనీస సంకేతం కింద జోన్ జనరల్ మేనేజర్ పోస్టు అయినా తక్షణం కేటాయిచాల్సి ఉంది. అయితే ఆ దిశగా నూతన ప్రభుత్వం కొలువుదీరిన తరువాత ఒక్క అడుగూ పడలేదు.

రెండు స్థలాలు సిద్ధంగా ఉన్నప్పటికీ..

విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం స్థలం చూపడం లేదంటూ గతంలో బిజెపి కేంద్ర మంత్రులు ఆరోపించడం తెలిసిందే. విశాఖ రైల్వే డిఆర్ఎం కార్యాలయం వెనక భాగంలో 30 ఎకరాల వరకూ స్థలం సిద్ధంగా ఉంది. గతంలో బిఆర్‌టిఎస్ కోసం రైల్వే నుంచి 26 ఎకరాలను జివిఎంసి తీసుకోగా దానికి ప్రత్యామ్నాయంగా ముడసర్లోవ వద్ద సర్వే నెంబరు 57 నుంచి 59 పి, 61 పి, 62 పి, 63, 64, 65ల్లో 52 ఎకరాలను కేటాయిస్తూ రైల్వేకు ఉత్తర్వులు కూడా ఇచ్చింది. దీంట్లో ఇప్పటికే 27 ఎకరాల వరకూ క్లియర్ భూమి సిద్ధంగా ఉంది. కావాలనే కేంద్రంలోని బిజెపి సర్కారు జాప్యం చేస్తూ జోన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు పనులు చేపట్టడం లేదు. 2016-17లో రైల్వే డివిజన్ కేంద్రాన్ని ఇక్కడ నుంచి ఎత్తేసింది. దక్షిణ కోస్తా రైల్వే జోన్ విశాఖకు ఇస్తున్నట్లు ప్రకటించి ఉన్న వాల్తేరు రైల్వేను వెనక్కి లాగేసింది. విశాఖకు 200 కిలోమీటర్లలోపు విజయవాడ డివిజన్ ఉండగా వాల్తేరు రైల్వే వేరేగా ఎందుకు ? అనేది కేంద్రం వాదన. విజయవాడకు 40 కిలోమీటర్ల దూరమే గుంటూరు.. అలాంటప్పుడు డివిజన్ అదెందుకు అనే ప్రశ్నకు వారి వద్ద సమాధానం లేదు. అడ్డగోలుగా వాల్తేరు రైల్వేకు ఉద్వాసన పలికి జోన్ కూడా ఇవ్వడం లేదు. కొత్తగా రైల్వే జోన్ ఇచ్చిన ఎక్కడా కూడా దేశంలో డివిజన్‌ను ఎత్తేయలేదు.

విశాఖ రైల్వే స్టేషన్ (ఫైల్ ఫొటో)

రైల్వే ఆస్తులకు విశాఖ కేంద్రం

విశాఖ కేంద్రంగా కంచరపాలెంలో రైల్వే కోచింగ్ కాంప్లెక్స్ ఉంది. ఎలక్ట్రికల్ లోకో షెడ్, డీజిల్ లోకో షెడ్ ఇక్కడే ఉన్నాయి. వడ్లపూడిలో రైల్ వ్యాగన్ వర్క్‌షాప్ ఉంది. వందల సంఖ్యలో ఆఫీసర్లు, ఉద్యోగులు ఆయా సెంటర్లలో పనిచేస్తున్నారు. డివిజన్‌ను తీసేసినా ఆ ఆస్తులు ఇక్కడ ఉన్నందున వారంతా ఇక్కడే పనిచేయాలి. రైల్వే డివిజనల్ ఆసుపత్రి కూడా విశాఖలోనే ఉంది. డివిజన్ లేకుండా చేయాలనే కుట్ర తప్ప ఎంత మాత్రమూ కేంద్ర నిర్ణయం సముచితం కాదు. విశాఖలో రెండు పోర్టులున్నాయి. స్టీల్‌ప్లాంట్, ఇతర పరిశ్రమల ఉత్పత్తుల ఎగుమతి, దిగుమతుల విషయంలో సమన్వయం చేసుకోడానికి అడిషనల్ డిఆర్ఎం స్థాయి అధికారి ఇక్కడ ఉండాల్సిన అవసరం ఉంది. డివిజన్ లేకుండా చేసి వాల్తేరు స్థాయిని తగ్గించే బిజెపి కుట్రలపై కూటమి పార్టీల నేతలు ప్రశ్నించకపోతే విశాఖకు తీవ్ర అన్యాయం చేసిన వారవుతారన్న అభిప్రాయం సర్వత్రా వినిపిస్తోంది.

నేటి నుంచి సురభి నాటకాలు

ప్రవేశం ఉచితం - జయప్రదం చేయాలని రంగసాయి నాటక సంఘం పిలుపు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

ఈ నెల 29 నుంచి విశాఖ నగరంలోని మద్దిలపాలెం కళాభారతి ఎసి ఆడిటోరియం వేదికగా వారం రోజులు పాటు సురభి నాటకోత్సవాలను నిర్వహిస్తున్నట్టు రంగసాయి నాటక సంఘం వ్యవస్థాపకులు బాదంగీర్ సాయి వెల్లడించారు. శుక్రవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారతదేశ నాటక రంగ చరిత్రలో సురభికి ప్రత్యేకమైన స్థానం ఉందన్నారు. 140 సంవత్సరాలుగా భారత్ సహా బర్మా, ప్యారిస్ తదితర దేశాల్లో కూడా ఈ నాటకాలను ప్రదర్శిస్తున్నట్టు తెలిపారు. అటువంటి సురభి నాటకాలను రంగసాయి నాటక సంఘం ఆధ్వర్యాన వందకుపైగా విశాఖలో ప్రదర్శింపజేసినట్టు పేర్కొన్నారు. ఈ ఏడాదికిగాను ఈ నెల 29న మాయాబజార్, 30న భక్త ప్రహ్లాద, జులై 1న లవకుశ, 2న భూకైలాస్, 3న పాతాళ భైరవి, 4న శ్రీకృష్ణ లీలలు, 7న మాయాబజార్ నాటకాన్ని కళాభారతి యాజమాన్యం సహకారంతో ప్రదర్శించనున్నట్టు తెలిపారు. కార్యక్రమ ముఖ్య నిర్వాహకులుగా తనతోపాటు సీనియర్ జర్నలిస్టు నాగనబోయిన నాగేశ్వరరావు వ్యవహరిస్తారన్నారు. ఎస్ఆర్‌కె. ఇన్ఫ్రా ప్రాజెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ ఎమ్ఎస్ఎన్.రాజు, ఉపకార్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కంచర్ల అచ్యుతరావు, కళా హాస్పిటల్ ఎమ్‌డి డాక్టర్ పివి.రమణమూర్తి, కార్మిక నాయకులు వివి.వామనరావు, ప్రముఖులు వివి.రమణమూర్తి, డాక్టర్ సూరపనేని విజయకుమార్, మావూరి వెంకటరమణ, పైడా కృష్ణ ప్రసాద్ వంటి కొంతమంది నగర పెద్దల సహకారంతో ఈ సురభి నాటకోత్సవాలను ఏర్పాటు చేశామన్నారు. నాటకాలను తిలకించడానికి ఏ విధమైన ప్రవేశ రుసుమూ లేదని, అందరూ ఆహ్వానితులేనని అన్నారు.

నాటకాన్ని తిలకించిన తర్వాత ప్రేక్షకులు తమ సహాయ సహకారాలను సురభి కళాకారులకు, సురభి సహాయ నిధికి అందజేయవచ్చని తెలిపారు. నాటకోత్సవాలను విశాఖ వాసులు జయప్రదం చేయాలని కోరారు. మీడియా సమావేశంలో నాగనబోయిన నాగేశ్వరరావు, వర్రె నాంచారయ్య, ప్రముఖ నటి శివజ్యోతి, నటుడు రమేష్ యాదవ్, రచయిత రవి బ్రహ్మ పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ద్వారా పథకాలు అమలు చేయాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ద్వారా పథకాలు కొనసాగించాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో భవన నిర్మాణ కార్మికుల జిల్లా విస్తృత స్థాయి సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షురాలు పి.అనసూయ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఉచితంగా ఇసుక ఇస్తానని చెప్పి, ఇసుక ధరలు భారీగా పెంచి ఇసుకను అందుబాటులో లేకుండా చేసిన విషయాన్ని గుర్తుచేశారు. భవన నిర్మాణ కార్మికులు కరోనా సమయంలో పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతుంటే ఒక్క రూపాయి కూడా వెల్ఫేర్ బోర్డు ద్వారా చెల్లించలేదన్నారు. భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డులో వున్న సొమ్మును ప్రభుత్వం తమ ప్రచార ఆర్భాటాలకు ఉపయోగించుకుంది తప్ప కార్మికుల సంక్షేమానికి ఖర్చుపెట్టలేదని తెలిపారు. భవన నిర్మాణ కార్మికులు ప్రమాదంలో మరణించినా, అంగవైకల్యం చెందినా, కుటుంబంలో ఆడ పిల్లలకు వివాహం జరిగినా గతంలో ఇస్తున్నటువంటి డబ్బులను ఆపివేసిందన్నారు. తక్షణమే వెల్ఫేర్ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. భవన నిర్మాణ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న క్లైములను లేబర్ డిపార్టుమెంట్ ద్వారా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. చంద్రబాబు ప్రభుత్వం తక్షణమే భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం కృషి చేయాలని కోరారు. ప్రజలందరికీ ఇల్లు కడుతున్న భవన నిర్మాణ కార్మికులకు సొంత ఇల్లు లేకపోవడం శోచనీయమన్నారు. వెంటనే ఇల్లు లేని కార్మికులకు ఇల్లు నిర్మించే చర్యలను ప్రభుత్వం చేపట్టాలన్నారు.

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం



ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి
(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ